సాక్షి
శ్రీకాకుళం
సోమవారం । 2 । డిసెంబర్ । 2024



మందులు నిల్

ప్రభుత్వాస్పత్రుల్లో మందుల కొరత వేధిస్తోంది. రోగులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.

- 8లో



హెచ్‌ఐవీపై అవగాహన..

ఎయిడ్స్‌డే సందర్భంగా ర్యాలీలు జరిగాయి. వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

- 8లో

విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాల పంపిణీ రేపు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): జెడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం నిర్వహించనున్నామని, ఉపకరణాలు కూడా పంపిణీ చేస్తామని జిల్లా విభిన్న ప్రతిభావంతుల సహాయసంచాలకులు కవిత తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లా స్థాయి ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతుల ప్రధానం చేస్తామని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

బోరుబద్ర పీహెచ్‌సీ వైద్యురాలికి షోకాజ్ నోటీసు

అరసవల్లి: సంతబొమ్మాళి మండలం బోరుబద్ర పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ దేవీ వనితకు షోకాజ్ నోటీస్ జారీ చేయాల్సిందిగా డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.మీనాక్షికి రాష్ట్ర వైద్య శాఖ డైరెక్టర్ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. శనివారం బోరుబద్ర పీహెచ్‌సీ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఆకస్మికంగా సందర్శించారు. అయితే పీహెచ్‌సీలో పనిచేస్తున్న ఇద్దరు వైద్యులు అందుబాటులో లేకపోవడంతో మంత్రి అచ్చెన్న ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. అనంతరం సమయ పాలన పాటించకపోవడంతో మంత్రి అచ్చెన్న ఇచ్చిన సూచన మేరకు ఆలస్యంగా విధుల్లోకి వచ్చిన వైద్యురాలు దేవి వనితకు షోకాజ్ నోటీసు జారీ చేసేందుకు సన్నద్ధమయ్యారు. ఈ మేరకు డైరెక్టరేట్ నుంచి వచ్చిన ఆదేశాల ప్రకారం సోమవారం డాక్టర్ దేవీవనితకు షోకాజ్ నోటీసును జారీ చేయనున్నారు.

సోమయ్యపేట పరిసరాల్లో పులి సంచారం



సోమయ్యపేట సమీపంలో పొలాలలో పాద ముద్రలను పరిశీలిస్తున్న అటవీ శాఖ సిబ్బంది

సారవకోట: మండలంలోని కుమ్మరిగుంట పంచాయతీ సోమయ్యపేట సమీపంలో పులి పాదముద్రలు గుర్తించినట్లు అటవీ బీట్ అధికారి శివ తెలిపారు. పొలాలకు వెళ్లిన స్థానికుడికి పులి కనిపించడంతో అతను అటవీశాఖకు సమాచారం అందించాడు. సిబ్బంది వెళ్లి పరిశీలించగా పులి పాదముద్రలు కనిపించాయని ఆయన తెలిపారు. పొలాల నుంచి పూల కొండవైపు వెళ్లినట్లు తెలుస్తోందన్నారు. చోడసముద్రం, సోమయ్యపేట, సింగంవలస తదితర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

అలరించిన సుధారాణి గాత్ర కచేరి



కీర్తనలను ఆలపిస్తున్న సుధారాణి

శ్రీకాకుళం కల్చరల్: అరసవల్లిలోని అనివెట్టి మండపంలో ఆదివారం నిర్వహించిన కృష్ణవేణి సంగీత నీరాజనం అలరించింది. కేంద్ర పర్యాటక సాంస్కృతిక శాఖ నిర్వహణలో ఏర్పాటు చేసిన ఈ గాత్ర కచేరిని ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి ప్రారంభించారు. ప్రఖ్యాత కళాకారిణి మండ సుధారాణి కర్ణాటక శాస్త్రీయ గాత్ర కచేరితో ఆకట్టుకున్నారు. ముత్తుస్వామి దీక్షితులు, త్యాగరాజు కీర్తనలను చక్కగా ఆలపించారు. వయొలిన్‌పై మావుడూరు సత్యనారాయణ శర్మ, మృదంగంపై ఎం.శ్రీధర్, ఘటంపై మావుడూరు సూర్య ప్రసాదరావులు వాద్యసహకారాన్ని అందించారు. కార్యక్రమంలో న్యూఢిల్లీకి చెందిన సంగీత నాటక అకాడమీ ప్రతినిధి సంతోష్‌ప్రసాద్ ఈఓ వై.భద్రాజీ, టూరిజం అధికారి నారాయణరావు, డీపీఐఆర్‌వో చెన్నకేశవరావు, ఇప్పిలి శంకరశర్మ, పులఖండం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

రణస్థలం: శ్రీకాకుళం నగరవాసులకు రణస్థలం రామతీర్థాలు కూడలిలో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. నగరానికి చెందిన అరుణ్ కుమార్ దంపతులు కారులో విశాఖపట్నం వైపు నుంచి శ్రీకాకుళం వస్తున్నారు. రణస్థలం జాతీయ రహదారిపై రామతీర్థాలు కూడలి వైపు వచ్చేసరికి వెనుక నుంచి వచ్చిన లారీ బలంగా ఢీకొట్టింది. దీంతో కారు ఒక్కసారి రామతీర్థాలు వైపు నుంచి వచ్చినట్లు తిరిగిపోయింది. లారీ డ్రైవర్ సడన్ బ్రేకు వేయడంతో కారును ఢీకొని ఆగిపోయింది. కారులో ఉన్న అరుణ్‌కుమార్ దంపతులకు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. శనివారం పోలిపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబీకులకు తాము బంధువులమని అరుణ్‌కుమార్ దంపతులు చెప్పారు.



రణస్థలం రామతీర్థాలు కూడలిలో కారును ఢీకొన్న లారీ

సర్కారు వాత చార్జీల మోత



- విద్యుత్ వినియోగదారులపై రెండు సార్లు సర్దుబాటు చార్జీల భారం
- యూనిట్ విద్యుత్‌పై గరిష్టంగా రూ.2.50 అదనం
- జిల్లాలో 7.88 లక్షల మంది వినియోగదారులపై ప్రభావం
- ఆందోళనలో వినియోగదారులు

అరసవల్లి:

చంద్రబాబు తన మార్కును మరోమారు చూపించారు. ఎన్నికల ముందు ఎట్టి పరిస్థితుల్లోనూ కరెంటు బిల్లులు పెంచబోమని హామీ ఇచ్చిన బాబు ఇప్పుడు అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రెండు సార్లు విద్యుత్ చార్జీలు పెంచారు. ఇంధన సర్దుబాటు చార్జీల పేరిట గత నెలలోనే వినియోగదారులపై భారాన్ని మోపిన సర్కార్ ఇప్పుడు ఈ నెల నుంచే మరో బాదుడికి సిద్ధమైంది. 2026 వరకు ఈ బాదుడును వినియోగదారులు భరించేలా తీర్మానించి కొత్త చార్జీలను అమలు చేసేశారు. ఈ మేరకు విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్‌సీ) నుంచి ఆమోదం లభించడంతో జనం నెత్తిన కొత్త భారం పడనుంది.

వరుసగా రెండోసారి చార్జీల మోత


ఇంధన సర్దుబాటు చార్జీల పేరిట ఇటీవలే డిస్కంల ప్రతిపాదనలను నియంత్రణ మండలి ఆమోదించడంతో దాదాపుగా ఎల్‌టీ వినియోగదారుని విద్యుత్ వినియోగ యూనిట్‌కు గరిష్టంగా రూ.2.50 వరకు పెరిగింది. రెండు నెలల క్రితం యూనిట్ వినియోగ చార్జీలు రూ.1.55 వరకు పెంచేసిన సర్కార్ ఇప్పుడు రెండోసారి మరో రూ.0.92 వరకు పెంచేస్తూ నిర్ణయించింది. దీంతో వరుసగా రెండు సార్లు చార్జీల పెంపు అమలు చేయడంతో విద్యుత్ వినియోగదారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. మొదటి పెంపుతో నవంబర్ నుంచి 2026 జనవరి వరకు, అలాగే రెండో దఫా పెంపుతో ఈనెల నుంచి 2026 నవంబర్ వరకు అదనపు చార్జీల భారం పడనుంది.

ప్రభుత్వం చేతులెత్తేయడంతోనే..

వాస్తవానికి ఇంధన విద్యుత్ కొనుగోలు ఖర్చు సర్దుబాటు చార్జీలను ఎప్పటికప్పుడు ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలే బాధ్యత వహించి ఆ నష్టాలను భరిస్తూ ఉంటాయి. అలాంటిది రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అలాంటి పరిస్థితులు కనిపించలేదు. విద్యుత్ కొనుగోలు భారాలను ప్రజలపై రుద్దాలని నిర్ణయించుకుని గద్దెనెక్కిన ఆరు నెలల్లోనే రెండు సార్లు చార్జీల పెంపుతో బాదేసింది. నిజానికి ప్రభుత్వాలే ఈ భారాన్ని భరిస్తే విద్యుత్ చార్జీల పెంపు అనేది జరిగే అవకాశం ఉండేది కాదు. అయితే ఈ సర్దుబాటు భారాన్ని తాము మోయలేమంటూ కూటమి సర్కార్ చేతులెత్తేయడంతో విద్యుత్ చార్జీల పెంపు షాక్ రాష్ట్ర ప్రజలకు తప్పడం లేదు. దీంతో విద్యుత్ వినియోగదారుల్లో ఒకింత ఆందోళన నెలకొంది.

ఆందోళనకు సిద్ధం

ఈ సర్దుబాటు చార్జీల పెంపు అంశంపై జిల్లా వ్యాప్తంగా అటు వినియోగదారులు, ఇటు ప్రజాపక్షాన ఉన్న ప్రతిపక్షాలు సైతం ఆందోళనకు సిద్ధమయ్యాయి. ఇప్పటికే వైఎస్సార్‌సీపీ నేతలు జిల్లా వ్యాప్తంగా పత్రికా సమావేశాల ద్వారా నిరసనలు తెలియజేస్తుంటే కాంగ్రెస్‌తో పాటు సీపీఐ, సీపీఎం పార్టీల నేతలు విద్యుత్ కార్యాలయాల వద్ద ఒక రోజు ధర్నా కార్యక్రమాలను నిర్వహించారు. అయితే ఈ విద్యుత్ చార్జీల పెంపు అంశంపై అధికార పార్టీకి ఎలాంటి మచ్చ అంటకుండా ఉండేలా కూటమి నేతలు అప్రమత్తమై ఆ మచ్చను గత ప్రభుత్వంపై నెట్టేసేలా ప్రణాళికలను సిద్ధం చేశారు. ఇదే ఉద్దేశాన్ని విద్యుత్ శాఖ అధికారులతో కూడా చెప్పించేలా తద్వారా ప్రజల్లో అధికార పార్టీపై ఎలాంటి వ్యతిరేకత లేకుండా చర్యలకు దిగుతున్నట్లుగా సమాచారం.



రూ.6 కోట్లు వరకు పెరిగిన డిమాండ్

జిల్లాలో తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో శ్రీకాకుళం, పలాస, టెక్కలి డివిజన్ల పరిధిలో మొత్తం 7,88,078 విద్యుత్ కనెక్షన్లున్నాయి. వీటిలో 477 హెచ్‌టి కనెక్షన్లుంటే మిగిలినవన్నీ ఎల్‌టి వినియోగదారులవే. ఇంతవరకు ఈ విద్యుత్ కనెక్షన్ల నుంచి విద్యుత్ వినియోగం దృష్ట్యా అన్ని రకాల చార్జీలతో కలిపి అక్టోబర్ నెలాఖరు నాటికి రూ. 97.55 కోట్లు కాగా, నవంబర్ నెలాఖరుకు (మొదటి సర్దుబాటు చార్జీతో కలిపి) డిమాండ్ ఏకంగా రూ.100.45 కోట్లు వరకు పెరిగింది. ఇక రెండోసారి సర్దుబాటు చార్జీలతో కలిపితే ఈ డిమాండ్ మరో రూ.3 కోట్ల వరకు పెరిగే అవకాశాలున్నాయని విద్యుత్ శాఖ ఈఆర్వో విభాగాధికారులే చెబుతున్నారు. విద్యుత్ వినియోగం పెరిగే క్రమంలో ఈ యూనిట్ చార్జీల పెంపు కూడా తోడైతే కచ్చితంగా వినియోదారునిపై భారం తప్పదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తాజా పరిణామాలతో ఎల్‌టీ (డొమస్టిక్) వినియోగదారునికి యూనిట్‌కు ప్రస్తుతానికి రూ.1.90 వసూలు చేస్తుండగా, వచ్చే నెలలో చెల్లించాల్సిన ఈ నెల వినియోగ బిల్లు రూ.4.40 వరకు వరకు వసూలు చేసే అవకాశాలున్నాయి. అదే అధికంగా విద్యుత్‌ను వినియోగించే వినియోగదారునికైతే యూనిట్ విద్యుత్ చార్జీ ఏకంగా గరిష్టంగా రూ.14 వరకు చేరనుందని లెక్కలు చెబుతున్నాయి. దీంతో విద్యుత్ వినియోగ డిమాండ్ ప్రకారం నెలకు అదనంగా జిల్లా వ్యాప్తంగా గరిష్టంగా రూ.6 కోట్ల వరకు పెరగనున్నట్లు అంచనా వేస్తున్నారు.

హామీలు మరిచి.. భారం మోపుతున్నారు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ధర్మాన కృష్ణదాస్

శ్రీకాకుళం రూరల్: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. హామీలు మర్చిపోయి ఇప్పుడు విద్యుత్‌భారం పెంచుతున్నారని విమర్శించారు. ఆయన ఆదివారం శ్రీకాకుళంలోని ధర్మాన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పుడు కరెంటు చార్జీలపై మాట్లాడిన కూటమి నాయకులు ఇప్పుడెందుకు చార్జీలు పెంచుతున్నారని ప్రశ్నించారు. నిత్యావసరాల ధరలు కూడా పెరిగాయని అన్నారు. లోకేష్ చెప్పిన విధంగా రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, శ్రేణులపై దాడులు చేయడం సరికాదన్నారు. 50 ఏళ్లకే పెన్షన్, నిరుద్యోగ భృతి, మహిళలకు నెలకు రూ.1500, ఉచిత బస్ సౌకర్యాలు వంటివి అమలు చేయలేదని గుర్తు చేశారు.

వైఎస్సార్ సీపీ హయాంలో ప్రతి పథకాన్ని పారదర్శకంగా అమలు చేశామని తెలిపారు. విద్య, వైద్యం, వ్యవసాయంపై చెరగని ముద్ర వేశామన్నారు. జిల్లాలో కిడ్నీ ఆస్పత్రి కట్టామని, మూలపేట పోర్టు నిర్మాణం మొదలుపెట్టామని, వంశధార నుంచి రూ.700 కోట్లతో పలాసకు మంచినీటి సదుపాయం కల్పించామన్నారు. కానీ కూటమి నాయకులు ఇలాంటి పనులపై దృష్టి పెట్టకుండా విపక్షంపై కక్ష సాధించేందుకే పని చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎంపీ పద్మావతి, అంబటి శ్రీనివాసరావు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, మామిడి శ్రీకాంత్, మెంటాడ స్వరూప్, గేదెల పురుషోత్తం పాల్గొన్నారు.

సర్కారుది నయవంచన



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్

కవిటి: బూటకపు హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం ఆరునెలలైనా పూర్తికాకముందే రెండుసార్లుగా విద్యుత్ ట్రూ అప్, ఇంధన సర్దుబాటు చార్జీలను పెంచడం దురదృష్టకరమని ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ ధ్వజమెత్తారు. ఆదివారం కవిటిలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల ప్రచార సభల్లో చంద్రబాబునాయుడు తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు పెంచబోదని చెప్పారని, కానీ బిల్లు కడితేనే కరెంటు షాక్ కొట్టేలా ఆర్థిక భారం మోపుతున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ప్రజలకు వైద్యశాలల్లో మందులు అందుబాటులో లేవని, తొలిసంతకం అంటూ ఆర్భాటంగా ప్రకటించిన డీఎస్సీ పరీక్ష జరగడం లేదని, నిత్యావసరాల ధరలు ఇష్టారాజ్యంగా పెరిగిపోతున్నాయని తెలిపారు. ఏ రంగంలోనూ ప్రభుత్వం ప్రజలకు మేలు చేసే ఒక్క నిర్ణయం కూడా తీసుకోలేదన్నారు. సమావేశంలో ఎంపీపీ కడియాల పద్మ, మండల కన్వీనర్ కడియాల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నేవీ డే సంబరాలు



కేక్ కోస్తున్న నేవీ విశ్రాంత, ప్రస్తుత ఉద్యోగులు

ఎచ్చెర్ల క్యాంపస్: నావికా దళ మాజీ సైనికులు ముందస్తు నేవీ డే వేడుకలను ఆదివారం కుశాలపురంలోని సింహద్వారం వద్ద ఉన్న ఓ ప్రైవేట్ రిసార్ట్‌లో నిర్వహించారు. తాము పనిచేసిన రోజుల్లో జ్ఞాపకాలు, సాహసాలను అందరితో పంచుకున్నారు. అలాగే అమరవీరులకు నివాళులర్పించారు. జిల్లా ఎక్స్ సర్వీస్‌మెన్ ఫెడరేషన్ అధ్యక్షుడు పూర్ణ చంద్రరావు కటకం మాట్లాడుతూ యువత దేశ రక్షణకు సంబంధించి త్రివిధ దళాల్లో చేరేందుకు ఆసక్తి చూపించాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో విశ్రాంత నేవీ ఉద్యోగులు పైడి నాగేశ్వరరావు, పైడి భాస్కర్‌కుమార్, సీపాన రమణమూర్తి, పైడి తవిటయ్య, పైడి విశ్వేశ్వరరావు, పైడి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఎవరి సామర్థ్యం ఎంత..?

- విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల మెరుగునకు కేంద్రం చర్యలు
- జిల్లాలో పరఖ్ సర్వేక్షణ్‌కు 92 పాఠశాలల ఎంపిక



పరఖ్ సర్వేక్షణ్-2024 లోగో

శ్రీకాకుళం న్యూకాలనీ: పాఠశాలల్లో విద్యార్థుల శక్తి సామర్థ్యాలు అంచనా వేసేందుకు కేంద్రం వినూత్న కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యం తీరును అంచనా వేసేందుకు సరికొత్త సామర్థ్య సర్వే నిర్వహిస్తున్నారు.

4న పరఖ్ సర్వే నిర్వహణ..

కేంద్ర ప్రభుత్వం పరఖ్ పేరిట డిసెంబర్ 4న సర్వే నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తోంది. పెర్ఫార్మెన్స్ అసెస్మెంట్, రివ్యూ అండ్ అనాలసిస్ ఆఫ్ నాలెడ్జ్ ఫర్ హోలిస్టిక్ డెవలప్మెంట్(పరఖ్) పేరుతో రాష్ట్రీయ సర్వేక్షణ్-2024 సర్వే నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ సర్వేను 2021లో చివరిసారిగా నిర్వహించారు. ఈ ఏడాది డిసెంబర్ 4న నిర్వహించేందుకు విద్యాశాఖ, సమగ్ర శిక్ష, ఎస్‌సీఈఆర్టీ సంయుక్తంగా చర్యలు చేపట్టాయి.

జిల్లాలో 92 పాఠశాలల్లో సర్వేకు చర్యలు..

శ్రీకాకుళం జిల్లాలో 92 పాఠశాలలను పరఖ్ సర్వే కోసం ఎంపిక చేశారు. వీటిలో ప్రభుత్వ పాఠశాలలు 56, ప్రైవేటు పాఠశాలలు 36 ఉన్నాయి. 3, 6, 9 తరగతుల విద్యార్థులను పరీక్షిస్తారు. ఇందులో ఒక్కో పాఠశాల నుంచి తరగతికి సగటున 30 మంది చొప్పున మూడు తరగతులకు సంబంధించిన విద్యార్థులను పరఖ్ నిబంధనలకు అనుగుణంగా ఎంపిక చేస్తారు.

జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ తిరుమల చైతన్య జిల్లా స్థాయి కోఆర్డినేటర్‌గా, డీసీఈబీ సెక్రటరీ గెడ్డాపు రాజేంద్రప్రసాద్ సహాయ జిల్లా స్థాయి కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తుండగా జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్‌గా తీడ ప్రసాదరావు(సీఆర్ఎంటీ సారవకోట), పట్ట వైకుంఠరావు (సీఆర్ఎంటీ జలుమూరు), సమగ్ర శిక్ష ఏఎంఓ చిగిలిపల్లి సుధాకర్ పర్యవేక్షిస్తున్నారు.

కాలువంతా నిర్లక్ష్యమే



గోకర్నపల్లి వద్ద నారాయణపురం కుడికాలువ

పొందూరు: అధికారుల నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారుతోంది. రబీకి ముందే బాగు చేయాల్సిన కాలువలను పట్టించుకోకుండా వదిలేస్తున్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మండలంలో గోకర్నపల్లి నుంచి కనిమెట్ట వరకు నారాయణపురం కుడి కాలువ విస్తరించి ఉంది. కాలువలో షిల్టు, పూడికలు పేరుకుపోయాయి. దీంతో నీరు పారేటప్పుడు ఓవర్ ఫ్లో అవుతోంది. తక్కువ నీరు వచ్చేటపుపడు పొలాల్లోకి నీరు చేరకుండా షిల్టు, పూడికలు అడ్డుకుంటున్నాయి. వర్షాకాలంలో తూతూ మంత్రంగా పనులు చేయిస్తుండటంతో ఎక్కడి పూడికలు అక్కడే ఉన్నాయి. అవసరమైన సమయంలో పనులు చేయకపోవడంతో అవసరం లేని సమయంలో పొలాల్లోకి నీరు చేరుతుంది. దీంతో పంటలు తీవ్రంగా దెబ్బ తిని రైతులు నష్టాల్లో మునుగుతున్నారు.



మెళియాపుట్టి: భరణికోట గ్రామం వద్ద నీటితో తడిసిన వరి



సోంపేట: పలాసపురంలో పండిన వరి చేనులో నీటిని బయటకు మళ్లిస్తున్న రైతు



నరసన్నపేట: సత్యవరానికి వెళ్లే మార్గంలో నేలకొరిగిన వరి పొలం



కాశీబుగ్గ: జగన్నాథ సాగరం దిగువ ఓ రైతు ప్రయాస

పంట తంటాలు

ఫెంగల్ రైతు పుట్టి ముంచేటట్టు కనిపిస్తోంది. రోజంతా పడిన జల్లులతో రైతులు పంటను కాపాడుకోవడానికి ఆపసోపాలు పడ్డారు. టార్పాలిన్లు కప్పుతూ, కుప్పలను రక్షిస్తూ రోజంతా ప్రయాస పడ్డారు. మరోవైపు ధాన్యం కొనుగోలు కేంద్రాలు సంసిద్ధంగా లేకపోవడంతో ఈ అత్యవసర పరిస్థితుల్లో దళారులకు ధాన్యం విక్రయించేందుకు చాలా మంది రైతులు మొగ్గు చూపారు.



రణస్థలంలో నేలకొరిగిన వరి పంట

చేతికందిన పంట నీటిపాలైంది



"రాత్రి నుంచి ధాన్యం తడవకుండా పరదాలు కప్పి జాగ్రత్తలు చేస్తున్నాం. అయినా ధాన్యం తడిసిపోయింది. ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొని, అప్పులు చేసి పండించిన పంట మా ఆకలి తీర్చకపోతే ఎలా బతకాలి. తడిసిన ధాన్యం ఆరబెట్టాలి. ఎంత ధర పలుకుతుందో తెలియని పరిస్థితిలో ఉన్నాం.

– సంపతిరావు చిరంజీవులు, పట్టుపురం గ్రామం మెళిమాపుట్టి మండలం

ఈ తంటాలు పడలేం.. లైన్ వ్యాపారులకే అమ్మేస్తున్నాం



కొనుగోలు కేంద్రాలకు ధాన్యం ఇవ్వాలంటే నానా తంటాలు పడాల్సి వస్తోంది. లైన్ వ్యాపారులు కూడా ధర బాగానే ఇస్తున్నారు. 80 కేజీల బస్తా రూ. 1740 ఇస్తున్నారు. అదే కొనుగోలు కేంద్రానికి ఇస్తే రూ. 1830 వస్తుంది. ఈ వంద రూపాయలకు ఆశపడి ఆ అవస్థలు పడలేం. కొనుగోలు కేంద్రాలు మరో 15 రోజులు ముందు ప్రారంభించి ఉంటే రైతులకు కొంత మేలు జరిగేది. వర్షాల వల్ల నష్టం తప్పదు."

– వెలమల గున్నయ్య, నారాయణ వలస

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి


వ్యక్తి మృతదేహం

ఎచ్చెర్ల: లావేరు మండలం బొంతుపేట జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఇతని వయసు సుమారు 70 ఏళ్లు ఉంటుందని పోలీసులు తెలిపారు. రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడని లావేరు పోలీసులు తెలిపారు. వివరాలు తెలిస్తే 6309990851 నంబరును సంప్రదించాలని కోరారు.

ఫిబ్రవరిలో మిస్టర్ ఆంధ్రా బాడీబిల్డింగ్ పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం నగరంలోని టౌన్‌హాల్ వేదికగా 2025 ఫిబ్రవరి 9వ తేదీన 30వ మిస్టర్ ఆంధ్రా బాడీబిల్డింగ్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్టు స్టార్ బాడీబిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బలగ ప్రసాద్, వడ్డాది విజయ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం పోస్టర్‌ను విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 500 మంది బాడీబిల్డర్లు హాజరయ్యేలా ఎంట్రీలు స్వీకరిస్తున్నట్టు చెప్పారు. విజేతలకు రూ.లక్షకుపైగా నగదు బహుమతులు, పతకాలు, టైటిళ్లు, ప్రసంశాపత్రాలను అందజేయనున్నట్టు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9949246693 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నాట్య కళాకారిణి నేహకు అవార్డు


అవార్డు అందుకుంటున్న నేహ

శ్రీకాకుళం కల్చరల్: నగరానికి చెందిన నాట్య కళాకారిణి డి.నేహ ప్రతిష్టాత్మక డాక్టర్ సి.పి.రావు మెమోరియల్ అవార్డు అందుకున్నారు. శనివారం హైదరాబాద్ శిల్పకళావేదికలో అమృత కల్చరల్ ట్రస్టు సమర్పణలో జరిగిన నాట్య తోరణం కార్యక్రమంలో ఐసీహెచ్ క్రియేటివ్ సొల్యూషన్స్ కో-ఫౌండర్ అనురాధ చంద్రశేఖర్, బీటెల్ రిమ్ సీఈఓ భార్గవి పగడాల, ఆనంద ఫౌండేషన్ వ్యవస్థాపకులు సీతా ఆనంద్, సామాజికవేత్త రేవతి భుపాల చేతుల మీదుగా అవార్డు, ధ్రువపత్రం, రూ.25వేలు నగదు పారితోషికం అందుకున్నారు. డాక్టర్ శ్రీకాంత్ రఘుపాత్రుని శిష్యురాలైన నేహ కూచిపూడిలో చేసిన సృజనాత్మక నాట్య ప్రదర్శనకు గాను ఈ అవార్డును ప్రదానం చేశారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి స్కేటింగ్ పోటీలు


విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

కాశీబుగ్గ: పలాస రోలర్ స్కేటింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా స్థాయి స్పీడ్ స్కేటింగ్ పోటీలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి 50 మంది క్రీడాకారులు హాజరయ్యారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు పీరుకట్ల విఠల్, క్లబ్ కోచ్ బి.చంద్రవతి తదితరులు పాల్గొన్నారు.

వైజాగ్ మారథాన్‌లో ఈశ్వరరావుకు స్వర్ణం


పతకంతో అన్నెపు ఈశ్వరరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాకు చెందిన మారథాన్ స్టార్ అన్నెపు ఈశ్వరరావు మరోసారి సత్తాచాటారు. విశాఖపట్నంలో ఆదివారం సంధ్యా మెరైన్స్ లిమిటెడ్ నిర్వహించిన 10కిలోమీటర్ల మారథాన్ (లాంగ్‌రేస్ పరుగుపందెం)లో మొదటిస్థానంలో నిలిచి శభాష్ అనిపించారు. నిర్వాహకులు, ప్రజాప్రతినిధుల చేతులమీదుగా బంగారు పతకంతోపాటు నగదు బహుమతి, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ రిటైర్డ్ వార్డెన్ పదుల సంఖ్యలో మారథాన్ పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలుస్తూ వస్తున్నారు. వీటితోపాటు మాస్టర్ అథ్లెటిక్స్ రాష్ట్ర,జాతీయస్థాయి పోటీల్లో పతకాల పంట పండిస్తున్నారు.

మందు ఫుల్.. మందులు నిల్!



- ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందుల కొరత
- నెలరోజులుగా నిలిచిన సరఫరా
- రాష్ట్ర స్థాయికి నివేదిస్తున్నా ఫలితం శూన్యం
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న రోగులు

శ్రీకాకుళం : కూటమి ప్రభుత్వం వచ్చాక నూతన పాలసీలో భాగంగా జిల్లాలో ఎక్కడ చూసినా మద్యం షాపులే దర్శనమిస్తున్నాయి. మందు నిల్వలతో లిక్కర్ దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. మందుకు ఇచ్చినంత ప్రాధాన్యం ప్రభుత్వం పేదలకు ఇవ్వాల్సిన మందులకు ఇవ్వడం లేదు. ఫలితంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందుల కొరత ఏర్పడి రోగులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

ఇదీ పరిస్థితి..

జిల్లాలోని వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న రిమ్స్‌తో పాటు ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ ఆస్పత్రులు, వైద్యశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న సీహెచ్‌సీ, పీహెచ్‌సీలను మందుల కొరత వెంటాడుతోంది. పాంటాప్, పారాసెటమాల్, డైక్లోఫినాక్సోడియం వంటి సాధారణ మందులు కూడా అందుబాటులో లేకపోవటంతో రోగులు బయటే కొనుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆస్పత్రులకు వచ్చే 80 శాతం మంది రోగులకు ఈ మందులే అవసరమవుతాయి. కారణం తెలియకపోయినా గత నెల రోజులుగా రాష్ట్ర సెంట్రల్ డ్రగ్ విభాగం నుంచి జిల్లా సెంట్రల్ డ్రగ్ విభాగానికి సరఫరా నిలిచిపోయింది.

గతమెంతో ఘనం..

గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు ఉన్న రోగులకు ప్రభుత్వ వైద్యశాలలే ఆధారం. గత ప్రభుత్వం వైద్యరంగాన్ని ఎంతో బలోపేతం చేసింది. మందుల సరఫరాతో పాటు అత్యంత ఆధునిక పరికరాలు, పనిముట్లు, యంత్రాలు ఆస్పత్రులకు సరఫరా చేసింది. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం వైద్య రంగం పట్ల నిర్లక్ష్యం చూపిస్తోంది. జిల్లా అధికారులు, హెచ్‌ఓడీలతో జరిగే సమావేశంలో వైద్యులు మందుల కొరత విషయాన్ని చెబుతున్నా ఫలితం లేకుండా పోతోందని వైద్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర స్థాయి అధికారులకు వైద్యాధికారులు జిల్లా అధికారుల ద్వారా నివేదించినప్పటికీ మందులు సరఫరా జరగటం లేదని, స్థానికంగా కొనుగోలు చేసుకోవాలని సూచిస్తున్నారని వైద్య వర్గాలు అంటున్నాయి. అయితే ఆ స్థాయిలో నిధులు లేకపోవటంతో కొంత వరకే కొనుగోలు చేస్తున్నామని చెబుతున్నారు. ఆస్పత్రులకు వచ్చే రోగులకు సంఖ్యకు తగ్గట్టుగా సరిపోవటం లేదని తెలియజేస్తున్నారు. రోగికి 50 మాత్రలు అవసరం అనుకుంటే 20 మాత్రలే ఇవ్వగలుగుతున్నారు. పేద రోగులకు అవసరమయ్యే మందులు తక్షణం సరఫరా చేయాల్సిన అవసరం ప్రభుత్వంపైన ఉంది. తరచు సమీక్షలతో సరిపెడుతున్న ప్రజా ప్రతినిధులు మందులు సరఫరా అయ్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

నివేదించాం..

సెంట్రల్ డ్రగ్ విభాగంలో అందుబాటులో ఉన్న మందులను వైద్య, ఆరోగ్య శాఖ, ఏపీవీవీపీ ఆస్పత్రులకు సకాలంలో సరఫరా చేస్తున్నాం. మా వద్ద నిల్వలు లేకపోతే రాతపూర్వకంగా తెలియజేసి స్థానికంగా కొనుగోలు చేసుకోవాలని ఆయా ఆస్పత్రుల డాక్టర్లకు సూచిస్తున్నాం. కొన్ని మందుల అవసరం విషయం రాష్ట్ర స్థాయికి తెలియజేశాం. రెండు, మూడు రోజుల్లో సరఫరా జరుగుతుందని పైఅధికారుల నుంచి సమాచారం వచ్చింది.

– సత్య ప్రభాకర్,
ఈఈ, ఏపీహెచ్ఎంహెచ్ ఐడీసీ, శ్రీకాకుళం

• ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన


తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు సందర్భంగా ఇచ్ఛాపురం మండలం హరిపురం గ్రామానికి చెందిన అసిరమ్మతల్లి కోలాట బృందం ప్రదర్శన అలరించింది. జానపద కళాకారుడు తిప్పన ధనుంజయం ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో అమ్మవారి తిరువీధుల్లో బృందం సభ్యులు కోలాటంతో భక్తుల్ని మంత్రముగ్ధుల్ని చేశారు. అనంతరం టీటీడీ సంస్థ కళాకారులను సత్కరించింది. కార్యక్రమంలో కోలాటం ఆర్గనైజర్లు లోపింటి శంకర్, జి.పరశురాం, చిల్ల ధర్మారాజు పాల్గొన్నారు.
–ఇచ్ఛాపురం రూరల్

టీడీపీ నేతల కుట్రలకు హైకోర్టు బ్రేక్


ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్న హుదూద్ ఇళ్ల లబ్ధిదారులు

టెక్కలి: సంతబొమ్మాళి మండలం మేఘవరం గ్రామంలో హుదూద్ ఇళ్లల్లో నివసిస్తున్న లబ్ధిదారుల పట్టాలను రద్దు చేసి వాటిని అమ్ముకోవాలని ప్రయత్నాలు చేసిన మంత్రి అచ్చెన్నాయుడు, టీడీపీ నాయకుల కుట్రలకు హైకోర్టు బ్రేక్ ఇచ్చిందని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఆయా లబ్ధిదారులంతా ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం దువ్వాడ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎంతో పారదర్శకంగా లబ్ధిదారులకు హుదూద్ ఇళ్లు కేటాయించారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక లబ్ధిదారులను బయటకు గెంటేసి ఆయా ఇళ్లను అమ్ముకోవాలని ప్రయత్నాలు చేశారని చెప్పారు. ఈ సమస్యను పంచాయతీకి చెందిన నాయకుడు పరపటి శ్రీనివాస్‌రెడ్డి తన దృష్టికి తీసుకురావడంతో ఇటీవల కలెక్టర్‌ను కలిసినట్లు వెల్లడించారు. అనంతరం హైకోర్టును ఆశ్రయిస్తే లబ్ధిదారులకు అనుకూలంగా ఆర్డర్ ఇచ్చిందని ఎమ్మెల్సీ తెలిపారు. ఇకపై లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు పరపటి శ్రీనివాస్‌రెడ్డి, మేరుగు అప్పారావు, నారాయణరావు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖలో వింత పోకడలు


మాట్లాడుతున్న డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రసన్న

శ్రీకాకుళం: ఇటీవల విద్యాశాఖ అధికారులు అవలంబిస్తున్న వింత పోకడలు ఆపాలని డీటీఎఫ్ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రసన్న అన్నారు. ఆదివారం శ్రీకాకుళంలో డీటీఎఫ్ ఉమ్మడి జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతికి సంబంధించి ఇంత వరకు ఆంగ్ల మాధ్యంలో బోధింప చేసిన విద్యాశాఖాధికారులు ఇప్పుడు ఏ మాధ్యమంలోనైనా పరీక్షలు రాయచ్చనని ఆదేశాలు ఇవ్వడం, ఫార్మేటివ్ అస్సైన్‌మెంట్ పరీక్షలను సెల్ఫ్ అసైన్‌మెంట్ పరీక్షలుగా పేరుమార్చి ప్రాజెక్టు, అసైన్‌మెంట్, రాతపనికి మూడు పదులు చొప్పున ముప్పై మార్కులు కేటాయించారని తెలిపారు. రాత పరీక్షలు 20 మార్కులకు నిర్వహించి మొత్తం 50 మార్కులకు స్కూల్ రికార్డులు, ఆన్‌లైన్‌లోను మార్కులు వేయించిన విద్యాశాఖ అధికారులు, ఇప్పుడు డిసెంబర్ 7న శనివారం జరుగనున్న మెగా పేరెంట్స్ సమావేశంలో ఇచ్చే విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులలో వాటిని మూడు ఐదు మార్కుల చొప్పున పదిహేను మార్కులకు, రాత పరీక్షల మార్కులను ముప్పై ఐదు మార్కులకు కుదించి ప్రోగ్రెస్ కార్డులలో వేయించడం వింతపోకడలకు నిదర్శనమన్నారు. ఇలాంటి అనాలోచిత నిర్ణయాలతో ఉపాధ్యాయులపై పనిభారం పెరుగుతుందన్నారు. అపార్ కార్డులు, రెసిడెన్సీయల్ ట్రెనింగ్‌లో సైతం అసంబద్ధ విధానాలు అవలంబించారని దుయ్యబట్టారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పి.కృష్ణారావు, జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.ధర్మారావు, విజయనగరం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అప్పలరాజు, మన్యం జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ రఘురామస్వామి, కార్యవర్గ సభ్యులు ప్రసాద్, రమణమూర్తి, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య



నరసన్నపేట: మండలంలోని బొరిగివలస సుబ్బారావు కాలనీలో నివాసముంటున్న గంగరావు వేణుగోపాలం (35) మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బొరిగివలసకు చెందిన ధనలక్ష్మితో శ్రీకాళహస్తికి చెందిన గంగరావు వేణుగోపాలంతో వివాహమైంది. ఇద్దరికీ ఇది రెండో వివాహం. శ్రీకాళహస్తిలో కొన్నాళ్లు కాపురం చేశారు. ఇటీవల ధనలక్ష్మి అక్కడ ఘర్షణ పడి కన్నవారింటికి వచ్చేసింది. కొద్ది రోజుల తరువాత వేణుగోపాలం కూడా ధనలక్ష్మి వద్దకు వచ్చేశాడు. ఏం జరిగిందో గానీ ఆదివారం ధనలక్ష్మి ఇంట్లో లేని సమయంలో వేణుగోపాలం ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ధనలక్ష్మి ఇంటికి వచ్చే సరికి వేణుగోపాలం వేలాడుతుండటంతో ఇరుగు పొరుగు వారికి పిలిచింది. వారు వచ్చి చూససరికే మృతి చెందడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ, సిబ్బంది పరిశీలించారు. మనస్తాపంతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. ధనలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నరసన్నపేట ఎస్‌ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట శిబిరంపై దాడి

రణస్థలం: మండలంలోని చిన్న పిషిణి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న 15 మందిని జె.ఆర్.పురం పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. వీరి నుంచి రూ.33,480 నగదు, 15 సెల్‌ఫోన్లు, 5 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. గ్రామాల్లోని పేకాట, కోడిపందేలు, బెట్టింగ్‌లు, గంజాయి వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలు సాగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు.

ఎన్ఎంఎంఎస్ మోడల్ టెస్ట్‌కు స్పందన


విజేతలకు బహుమతులు అందజేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

సంతబొమ్మాళి: మండలంలోని బోరుభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్ఎంఎంఎస్ మోడల్ పరీక్ష నిర్వహించారు. సంతబొమ్మాళిలోని ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలతో పాటు వజ్రపుకొత్తూరు మండలంలోని కొత్తపేట ఎంపీయూపీ స్కూల్ విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో ప్రథమ స్థానం సాధించిన సంతబొమ్మాళి ఉన్నత పాఠశాల విద్యార్థిని బి.నీలిమకు రూ.2వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన సంతబొమ్మాళి ఉన్నత పాఠశాల విద్యార్థిని కె.హిమబిందుకు రూ.1000 నగదు, తృతీయ స్థానంలో నిలిచిన ఎస్.యశ్వంత్‌రాజు(కొత్తపేట), కె.అభినయ్(సంతబొమ్మాళి), వి.యుగంధర్(సంతబొమ్మాళి) రూ.500 చొప్పున నగదు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రమాదం జరిగిన తీరుపై విచారణ


ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మణిబాబు

భోగాపురం: గత నెల 30వ తేదీన శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వెళ్తున్న ఫార్చునర్ కారు పోలిపల్లి జాతీయ రహదారి వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని పల్టీకొట్టి అవతలి లైన్‌లో విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వస్తున్న లారీని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీకాకుళానికి చెందిన నలుగురు వ్యక్తులు మృతిచెందిన విషయం తెలిసిందే. ప్రమాదం ఏవిధంగా జరిగిందనే అంశంపై డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మణిబాబు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ దుర్గారావులు ఆదివారం విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా ముందుగా ప్రమాదం జరిగిన ప్రదేశం వద్దకు వెళ్లి నేషనల్ హైవే రోడ్డును, ప్రమాదానికి గురైన కారును పరిశీలించారు. ప్రమాదం ఏవిధంగా జరిగింది, హైవే రోడ్డు నిర్మాణంలో ఏమైనా లోపాలు ఉన్నాయా? డ్రైవర్ కారును నిర్లక్ష్యంగా నడపడం వల్ల ప్రమాదం జరిగిందా? లేదా వెహికల్‌లో ఏమైనా లోపాలు ఉన్నాయా? అనే అంశాలపై విచారణ చేపట్టారు. ఈ విచారణలో వారివెంట నేషనల్ హైవే అథారిటీ ఇంజినీర్ మల్లికార్జునరావు, సీఐ ఎన్వీ ప్రభాకర్ పాల్గొన్నారు.

పౌరసేవల్లో కనీస ప్రమాణాలు కరువు


సమావేశంలో మాట్లాడుతున్న స్వచ్ఛ సుందర శ్రీకాకుళ సాధన సమితి సభ్యులు

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం మున్సిపాలిటీలో పౌరులకు అందజేస్తున్న సేవల్లో కనీస ప్రమాణాలు పాటించకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర కోశాధికారి జె.శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని రైతుబజార్ వద్ద విశ్రాంతి ఉద్యోగుల సమావేశ మందిరంలో స్వచ్ఛ సుందర శ్రీకాకుళ సాధన సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళ నగర పరిధిలో సేకరిస్తున్న చెత్త నుంచి సంపద తయారు చేసే కార్యక్రమం చేయడం లేదన్నారు. తడి చెత్త, పొడి చెత్త వేరు చేయకుండా తండ్యాంవలస వద్ద డంపింగ్ చేస్తున్నారని చెప్పారు. ప్రజలకు నిత్యం సరఫరా చేస్తున్న మంచినీటిలో క్లోరిన్ కలపడం, పీహెచ్ ప్రమాణాలు తగు వ్యవధులలో పరీక్షలు జరపడం వంటి జాగ్రత్తలు తీసుకోకపోవడం విచారకరమన్నారు. పట్టణంలో దోమల నివారణకు కనీస చర్యలు కూడా లేవన్నారు. కనీస ప్రమాణాలు పాటించక పోవడం వల్ల ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయన్నారు. అందుకే ప్రజలలో అవగాహన కల్పించడానికి స్వచ్ఛ సుందర శ్రీకాకుళ సాధన సమితి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ సుబ్బారావు, వంగా మహేష్, అర్జునరావు, చౌదరి లక్ష్మణరావు, ఉంగటి వెంకటరమణ, ప్రసన్న కుమార్, సుమతి, మోహన్, బీవీ రమణమూర్తి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

- వ్యాధిపై అపోహలు వీడాలి
- రక్తమార్పిడి సమయంలో జాగ్రత్తలు తప్పనిసరి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్


శ్రీకాకుళం ఏడు రోడ్ల కూడలి వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యారోగ్య శాఖాధికారులు, స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్/అరసవిల్లి: హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అందరూ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ఎయిడ్స్ డే సందర్భంగా జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అంబేడ్కర్ ఆడిటోరియంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. రక్తమార్పిడి సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ తరపున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎయిడ్స్‌పై అపోహలు వీడాలన్నారు. అనంతరం పలు అవగాహన కార్యక్రమాలతో పాటు ఎయిడ్స్ నియంత్రణ కోసం కృషి చేస్తున్న ఇండియన్ ఆర్మీకాలింగ్ డైరెక్టర్ బి.వి.రమణను కలెక్టర్ సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ ఏడాది హెచ్ఐవీ బాధిత చిన్నారులు, వ్యాధిగ్రస్తుల్లో మనోధైర్యం ఇవ్వాలనే ఉద్దేశంతో కలెక్టర్ పుండ్కర్, ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి, జిల్లా న్యాయ శాఖ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్‌ఖాన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, డీసీహెచ్ఎస్ డాక్టర్ కళ్యాణబాబుతో కలసి అల్పాహారం స్వీకరించారు.

భయాందోళన వద్దు..

ఎయిడ్స్ అంటే భయాందోళన పడకుండా మనోనిబ్బరంతో పాటు అవగాహనతో వ్యవహరిస్తే ఇబ్బందులు ఎదురు కావని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షి పిలుపునిచ్చారు. ఎయిడ్స్ డే సందర్భంగా డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎయిడ్స్ నివారణకు క్రమం తప్పకుండా మందులు వాడాలన్నారు. అంతకుముందు ర్యాలీలో ప్రజలకు ఎయిడ్స్‌పై అవగాహన కోరుతూ నినాదాలు చేస్తూ వివిధ కళాశాలల విద్యార్థులు, వైద్యారోగ్యశాఖా సిబ్బంది కలిసి ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు, సభ్యులు వెంకటస్వామి, బెజ్జిపురం యూత్‌క్లబ్ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

బి.వి.రమణను సత్కరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ →

